
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

సిద్దిపేట

5

శనివారం 10 ఫిబ్రవరి 2024



15 తర్వాత పెండింగ్ చలాన్లపై
స్పెషల్ డ్రైవ్

- అతివేగం, అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
- క్షతగాత్రులను గంటలోపు ఆసుపత్రిలో చేర్పించాలి
- మద్యం తాగి వాహనాలు నడపరాదు
- సీపీ డాక్టర్ బి.అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 9 : ఈనెల 15 తర్వాత సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్ చలానాలు ఉన్న వాహనదారులతో మొత్తం డబ్బు కట్టించడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ హెచ్చరించారు. 35వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్త, మద్యం సేవించడం, నిద్రలేమితనంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా ఏ ప్రదేశంలో అయినా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను గోల్డెన్ అవర్ అంటే ఒక గంటలోపు ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన వారు పోలీస్ స్టేషన్లో సాక్షిగా ఎలాంటి స్టేట్మెంట్ ఇవ్వవలసిన అవసరం లేదని, వారు కోర్టుకు రావలసిన అవసరం కూడా లేదన్నారు. ప్రాణాలు కాపాడడం చాలా ముఖ్యమన్నారు. ప్రమాదాల నివారణకు ప్రధానరహదారుల పక్కనే ఉన్న 66 గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. 462 మందిని సభ్యులుగా నియమించామని తెలిపారు. కారు నడిపేటప్పుడు సీట్ బెల్టు తప్పకుండా ధరించాలని, మోటార్సైకిల్ వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. బైక్లపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలన్నారు. మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకూడదని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మానవ తప్పిదంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతివేగంగా వాహనాలు నడిపి కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దన్నారు. వేగంగా వెళ్లే వాహనానికి నిబంధనల ప్రకారం వెళ్లే వాహనానికి 10 నుంచి 15 నిమిషాలు తేడా మాత్రమే ఉంటుందని సీపీ వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ సైడ్ వాహనాలు నడపవద్దని తెలిపారు. ఈ మధ్యకాలంలో కొంతమంది సెల్ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్నారని, ఇది అతి ప్రమాదకరమని తెలిపారు. అందరూ సమష్టిగా పనిచేసి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుప్రమాదంలో, ఇతర కారణాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని సీపీఆర్ చేసి ఎలా కాపాడాలో 108 సిబ్బంది డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, సిద్దిపేట ఏసీపీ సురేందర్రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ చంద్రశేఖర్, డీటీవో లక్ష్మణ్, సీఐలు, ఎస్ఐలు, రోడ్డు సేఫ్టీ కమిటీ మెంబర్లు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విద్యార్థులు, హెచ్కెఆర్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వరాలు కురిసేనా?



గౌరవెల్లి రిజర్వాయర్ డెలివరీ సిస్టర్న్

నేడు అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్

- గత ప్రభుత్వంలో సీఎం, ఆర్థికమంత్రి జిల్లావాసులే
- ఫలితంగా జిల్లాకు అత్యంత ప్రాధాన్యత
- ప్రస్తుతం నిధులిస్తేనే పలు పనులకు మోక్షం
- దుబ్బాక, చేర్యాల రెవెన్యూ డివిజన్ల ప్రకటనపై ఆసక్తి
- కొత్త ప్రాజెక్టులు, పనుల మంజూరుపైనా ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నేడు తొలిసారి బడ్జెట్ను ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం దక్కింది. అయితే జిల్లాకు ఎలాంటి వరాలు కురిపిస్తారోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. గత ప్రభుత్వంలో సీఎంగా కేసీఆర్, ఆర్థిక మంత్రిగా హరీశ్రావు ఉండడంతో నిధుల కేటాయింపులో జిల్లాకు అత్యంత ప్రాధాన్యత దక్కింది. వీరిద్దరూ జిల్లా నుంచే అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడమే ఇందుకు కారణం. పదేళ్లలో నిధుల వరద పారినప్పటికీ ఇంకా కొన్ని పనులు అపరిష్కృతంగానే ఉన్నాయి.


గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాకున్న ప్రత్యేకత వేరు. అందుకే అనతికాలంలోనే ఈ జిల్లా అభివృద్ధిలో ముందుకెళ్లింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్, నిధుల మంత్రిగా హరీశ్రావు కీలక హోదాల్లో ఉన్నందున అన్ని రంగాల్లోనూ జిల్లాను పరుగులు పెట్టించారు. దశాబ్దాలుగా నోచని పనులు సైతం గమ్యం చేరాయంటే అతిశయోక్తి కాదు. రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెట్టారంటే అందులో సిద్దిపేట జిల్లాకు ప్రత్యేక వడ్డింపు ఉండాల్సిందే అన్నట్లుగా మమకారం చూపించారు. మరి నేటి బడ్జెట్లో నిధుల కేటాయింపు ఎలా ఉంటుందోననే విషయం ఆసక్తిని కలిగిస్తోంది.

కొత్త డివిజన్లపై ఆశలు..

ప్రస్తుతం జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు కేవలం సిద్దిపేట మాత్రమే రెవెన్యూ డివిజన్గా ఉండేది. కాగా దుబ్బాకతోపాటు చేర్యాలను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించాలనే డిమాండ్ మిన్నంటింది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఈ దిశగా హామీలు ఇచ్చాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా ఈ హామీలను నెరవేరుస్తామని ప్రకటించింది. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ రెండింటినీ డివిజన్లుగా ప్రకటిస్తారనే ఆశలు నెలకొన్నాయి. ఒకవేళ చేర్యాల, దుబ్బాకలను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటిస్తే కార్యాలయాల నిర్వహణకు తగిన బడ్జెట్ను కేటాయించాల్సి ఉంటుంది.



దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం దీక్ష చేస్తున్న మహిళలు(ఫైల్)



అపరిష్కృతంగా రిజర్వాయర్లు

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను నిర్మించారు. అయితే గౌరవెల్లి మినహా మిగతా రిజర్వాయర్లలోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ప్రధాన కాలువలు, సొరంగాలను సైతం నిర్మించారు. కానీ ఆయకట్టు భూములకు నీరందించే మైనర్, సబ్ మైనర్ కాలువలను నిర్మించలేదు. నిధుల కొరత వల్లనే కాలువల నిర్మాణం అపరిష్కృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ పనుల కోసం గత ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ప్రస్తుతం ఆ నిధులు మంజూరు కాలేదు. కాలువల నిర్మాణానికి రూ.300 కోట్లు, భూసేకరణ కోసం రూ.400 కోట్లు అవసరం. ఇక కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన భూనిర్వాసితులకు ఇంకా పరిహారం చెల్లించాలనే విన్నపాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం కూడా నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

ఈ సమస్యలకు నిధులివ్వాలి..

- కలెక్టరేట్ సమీపంలో నిర్మించతలపెట్టిన వెటర్నరీ కళాశాలకు నిధుల మంజూరుతోపాటు ఉద్యోగులను నియమించాల్సి ఉంది.
- జిల్లాలోని పలు గురుకులాలకు సొంత భవనాలు లేవు.
- కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.
- తపాస్పల్లి రిజర్వాయర్కు అనుసంధానంగా కాలువలు నిర్మించాలి.
- దుబ్బాక నియోజకవర్గంలోని భూములకు నీరందించాలంటే ఇర్కోడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతోపాటు కాలువను నిర్మించాల్సి ఉంది.
- దుబ్బాక నియోజకవర్గంలో ఆర్అండ్బీ రహదారులకు రూ.167 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.54 కోట్లు మంజూరు చేయాలి.
- హుస్నాబాద్లో నిర్మించతలపెట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలి.
- మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట నియోజకవర్గానికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయడానికి నిర్మిస్తున్న వాటర్ రింగ్మెయిన్ను పూర్తి చేయాలి.
- రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్నందున జిల్లాలోని పలుచోట్ల పరిశ్రమల స్థాపనతోపాటు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి.
- జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్స్టేషన్ల నిర్మాణానికి నిధులు అవసరం.





సింగరాయ జాతరకు పోటెత్తిన భక్తులు, మోయతుమ్మెద వాగులో స్నానం చేస్తున్న భక్తులు, ఇన్సెట్లో ప్రతాపసింగరాయ నరసింహస్వామి

భక్తజన జాతర

మాఘ అమావాస్య ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- రామలింగేశ్వరస్వామి దర్శనానికి బారులు
- పుల్లూరు బండపై ఉత్సవాలు ప్రారంభం
- పులకించిన ప్రకృతి కోవెల సింగరాయ క్షేత్రం
- గుబ్బడి గుట్టపై దత్తాత్రేయుడికి నీరాజనం

మాఘ అమావాస్య జాతరలతో శుక్రవారం జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. కోహెడ మండలంలో ప్రకృతి అందాల మధ్య కొలువైన సింగరాయ లక్ష్మీనరసింహస్వామి... అక్బర్పేట- భూంపల్లి మండలంలో కూడవెల్లి జలపరవళ్లతో రామేశ్వరంపల్లి రామలింగేశ్వరస్వామి.. నంగునూరు మండలంలోని పాలమాకుల శివారులో ఏడాదికోసారి దర్శనమిచ్చే గుబ్బడి గుట్ట దత్తాత్రేయుడు.. సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు ఏకశిల బండపై వెలసిన స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాలు భక్తజనసంద్రమయ్యాయి. భక్తులు మాఘ పుణ్యస్నానాలు ఆచరించి తరించారు. మెదక్ జిల్లాలోని మంజీర నది ఒడ్డున ఏడుపాయల వనదుర్గమాత సన్నిధికి పోటెత్తారు.



రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద







పాలమాకుల శివారులోని గుబ్బడిగుట్ట దత్తాత్రేయ ఆలయం వద్ద భక్తుల సందడి, ఏడుపాయలలో జనసంద్రం, రామేశ్వరంపల్లి రామలింగేశ్వరస్వామి

మంతూరు వద్ద
మరో ఎత్తిపోతల పథకం

- అందోలులో అదనంగా 40వేల ఎకరాల సాగుకు నీరు
- శ్రీకారం చుట్టిన మంత్రి దామోదర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 9: పుల్కల్ మండలం మంతూరు వద్ద మరో ఎత్తిపోతల పథకం నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా ప్రాతినిథ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాల సాగుకు నీరందించే ఉద్దేశంతో ఈ ఎత్తిపోతల పథకం చేపట్టనున్నారు. సింగూరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఈ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, మునిపల్లి మండలాలలోని సుమారు 30 వేల పై చిలుకు ఎకరాలకు ఇప్పటికే సాగు నీరందిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు లక్షకు పైగా చిలుకు ఎకరాలకు సాగు నీరందించేందుకు గత ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు 2022 ఫిబ్రవరిలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్లో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటివరకు భూసేకరణ జరపకపోవడం, పనులు చేపట్టకపోవడం వంటి పరిణామాలకు తోడు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ పరిస్థితులలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని సమీక్షించాలని నిర్ణయించింది. ఈ ఎత్తిపోతల పథకం సంగతెలా ఉన్నా ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర్ కొత్తగా పుల్కల్ మండలం మంతూరు వద్ద ఎత్తిపోతల ద్వారా పథకం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ పథకం ఏర్పాటు కోసం చేసే సర్వేకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్గా కొత్త అధికారి రాగానే మంతూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు సర్వేకు అనుమతి వస్తుందని ఆ శాఖ తెలిపింది.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం



పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరేస్తున్న నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 9: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పీఆర్టీయూ పత్రికా సంపాదకవర్గ సభ్యుడు ఊడెం జయపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలాధ్యక్షుడు వేమారెడ్డి గజ్వేల్ పట్టణంలో పీఆర్టీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు, పీఆర్‌సీని సాధిస్తామని, జీవో 317 ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందని స్పష్టం చేశారు. వారితో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి తిగుళ్ల లింగంగౌడ్, నాయకులు బాల్‌చరణ్, శ్రీనివాస్, పోచయ్య, సత్యనారాయణరెడ్డి, యాదగిరి, భూపతిరెడ్డి, గురూజీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



కుకునూరుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కౌసల్యాదేవి

కొండపాక, ఫిబ్రవరి 9 : గ్రామాల్లో పారిశుధ్యం పనులు పకడ్బందీగా చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీఆర్డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కౌసల్యాదేవి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుకునూరుపల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, సీసీరోడ్లు డ్రైనేజీలను పరిశీలించారు. ఓపెన్ ప్లాట్లలో ఉన్న పిచ్చి మొక్కలను కచ్చితంగా తొలగించి గడువు లోగా స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగేందర్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, కారోబార్ శ్రీధర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.





ఏడుపాయల రాజగోపురం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు, వనదుర్గామాతకు బోనం తీసుకెళ్తున్న భక్తురాలు, చిట్కుల్ ఛాముండేశ్వరీమాత ఆలయం సమీపంలోని మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మాఘ అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల జాతరలు జరిగాయి. మాఘస్నానాలను ఆచరించిన భక్తులు దైవదర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాజల్లను, పాడి పంటలను చల్లగా చూడమని వేడుకున్నారు. మాఘ అమావాస్య సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తజన జాతర

మాఘ అమావాస్య ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

● పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ● ఏడుపాయలలో జనసంద్రం

పాపన్నపేట, ఫిబ్రవరి 9: మాఘ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ ప్రాంగణం జనారణ్యమైంది. శుక్రవారం మాఘ అమావాస్యను పురస్కరించుకుని మంజీరా నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంతమంతా కిక్కిరిసి పోయింది. పుణ్య స్నానాలనాంతరం అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్ద గంటల తరబడి బారులు తీరారు. జల్లు స్నానాల వద స్నానాల కోసం భక్తులు పోటీపడ్డారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

చేతులెత్తేసిన పోలీసులు

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను కల్పించడంలో దేవాదాయ శాఖ పాలక మండలి పూర్తిగా విఫలమైంది. దీనికి తోడు పోలీసులు చేతులు ఎత్తేయడంతో భక్తులు అవస్థలుపడ్డారు. బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో ఆ ప్రాంతంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది కనీస చర్యలు తీసుకోలేదు. ఏడుపాయల జాతరలోనే మెదక్ డీఎస్పీ ఉండి బందోబస్తును పర్యవేక్షించినప్పటికీ ఫలితం లేకపోయింది. తగినంత సిబ్బందిని జాతరకు కేటాయించకపోవడంతో భక్తులకు సమస్యలు తలెత్తాయి. బీఆర్ఎస్ నాయకులు హిపోప్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లను ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఏడుపాయల ఈవో మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, ఆలయ సిబ్బంది, జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో జరిగే మహాజాతరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మాఘ అమావాస్య ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్న ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవలనే ఏడుపాయల జాతర నిర్వాహణ, ఆలయ చరిత్రను ముఖ్యమంత్రికి తెలియజేసి, తాను, తన కుమారుడు మైనంపల్లి రోహిత్ ముఖ్యమంత్రికి తెలియజేసి మహాశివ రాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

కొప్పోల్‌లో కిటకిట

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 9: పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర స్వామి దేవాలయం శుక్రవారం భక్తులగతో కిటకిటలాడింది. ఆలయ సమీపంలోని కోనేటిలో వేకువ జాము నుంచి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించిస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి సంగప్ప ప్రత్యేక పూజలు చేశారు.

చిట్కుల్ మంజీరా ఒడ్డున పుణ్యస్నానాలు

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 9: చిట్కుల్ చాముండేశ్వరి ఆలయ సమీపంలో గల మంజీరా నదిలో భక్తులు శుక్రవారం మాఘ స్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి ఆలయం వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

పులకించిన పుల్లూరు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 9: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండపై గల స్వయంభూ లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాఘమ అమావాస్య సందర్భంగా బండపైన గల గుండంలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుల్లూరు బండ జాతరలో తడి, పొడి చెత్త వేసేందుకు డ్రమ్ముల ఏర్పాటు, ప్లాస్టిక్‌ను నివారించేందుకు సాహసనీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసి భక్తులకు అవగాహన కల్పించారు.



పుల్లూరు బండపై గుండంలో స్నానాలు

రామలింగేశ్వరాలయం భక్తిపారవశ్యం

దుబ్బాక, ఫిబ్రవరి 9: అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరం పల్లి రామలింగేశ్వరాలయం జాతర శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. మాండవ్యనదిగా పిలువబడే కూడవెల్లి వాగులో మాఘస్నానాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆలయ దర్శనం కోసం సుమారు 60వేల మందికి పైగా భక్తులు తరలివచ్చినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో రామలింగేశ్వరుడి దర్శనం కోసం సుమారు మూడు కిలోమీటర్ల పొడువునా క్యూలైన్‌లో నిలబడ్డారు. ఆలయానికి వచ్చే వాహనాలను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దుబ్బాక, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి బస్‌డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసీ, ప్రత్యేక రూట్లలో నడిపారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్‌ఐలు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. తిమ్మాపూర్, రామక్కపేట, భూంపల్లి పీహెచ్‌పీల సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

ప్రకృతి కోవెల సింగరాయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

కోహెడ, ఫిబ్రవరి 9: ఉత్తర తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన సింగరాయ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా పుష్య బహుళ (మాఘ) అమావాస్య రోజున ఈ జాతర జరుగుతుంది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాల శివార్లలో మోయతుమ్మెద వాగు ఒడ్డున ప్రతాప సింగరాయుడిగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జాతర వైభవంగా జరిగింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పడమరవాహినిగా పారే మోయతుమ్మెద వాగులో మాఘస్నానాలను ఆచరించారు. అనంతరం వాగు పక్కన చెలమను తోడి అందులో నుంచి తీసిన నీటితో వంకాయ కూర, చింతపండుచారు చేసుకుని అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. మరికొందరు వంకాయ, చిక్కుడు, టమాటాలను కలిపి కూర చేసుకోవడం గమనార్హం. జాతర కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కోహెడ ఎంపీపీ కొక్కులకీర్తి సురేష్, కోహెడ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు తిప్పారపు జ్యోతి శ్రీకాంత్ లు దర్శించుకున్నారు. ఈ జాతరలో మీనాక్షి షాపింగ్ మాల్ సుకుమార్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు 15 వేల చల్లని వాటర్, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. దాహం తీర్చినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

గుబ్బడి గుట్టపై దత్తాత్రేయుడికి నీరాజనం

నంగునూరు, ఫిబ్రవరి 9 : గుబ్బడి గుట్ట భక్తులతో శుక్రవారం కిటకిటలు ఆడింది. మండలంలోని పాలమాకుల శివారులోని విశాలమైన బండపై వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయానికి ఒక ప్రత్యేక ఉంది. మాఘ అమావాస్య సందర్భంగా ఒక్కరోజు మాత్రమే ఆలయం తెరిచి అదే రోజు సాయంత్రం మూసివేయడం ఆనవాయితీ. చీకోటి వంశస్థులు దత్తాత్రేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి జాతర నిర్వహించారు.






కొప్పోల్ ఉమాసంగమేశ్వర, ఝరాసంగం కేతకీ ఆలయాల్లోని కోనేటిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, కోహెడ మండలంలోని సింగరాయ గుట్టపై, రామేశ్వరంపల్లి రామలింగేశ్వరస్వామి జాతరలో భక్తుల సందడి

పూరిగుడిసె దగ్ధం.. రూ.8.50 లక్షల నష్టం



దగ్ధమైన గుడిసె వద్ద విచారణ జరుపుతున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

తూప్రాన్, ఫిబ్రవరి 9: పూరిగెడెసె దగ్ధమై సుమారు రూ. 8.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని మండల కార్యాలయాల సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలోని మండల కార్యాలయాలకు సమీపంలో కండెల నర్సింహులు, గంగోత్రి దంపతులు గుడిసెను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం నర్సింహులు బయటకు వెళ్లిపోగా, భార్య గంగోత్రి ఇంట్లో పూజలు చేసి దీపం వెలిగించి, సమీపంలో తెలిసిన వాళ్ల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న రూ.3లక్షల నగదు, నాలుగు తులాల బంగారు అభరణాలు, బియ్యం, ఇతర సామగ్రి, వంటపాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలియగానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.8.50 లక్షల నష్టం వాటిల్లినట్లు నాగరాజు తెలిపారు. తక్షణ సహాయంగా బియ్యం అందజేస్తున్నట్లు నాగరాజు వివరించారు.

మంజీరా నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికోడ్, ఫిబ్రవరి 9: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామ శివారులోని మంజీరా నది బ్యాక్ వాటర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామ శివారులో మంజీరా బ్యాంక్ వాటర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల ఉంటుందని నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని ఆయన పేర్కొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలకు తరలిరావాలి

● రాష్ట్ర కౌన్సిలర్ రాజారెడ్డి

గుమ్మడిదల ఫిబ్రవరి 9 : ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై మహాసభలు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కే.రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ గుమ్మడిదల మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సమ్యానాయక్‌తో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ కే.రాజారెడ్డి మాట్లాడుతూ... టీపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలు మాత్రమే కాకుండా సమాజంలో ఉన్న అనేక రుగ్మతల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందు నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు తెలిపారు. సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి గ్రామీణ బందుకు సంబంధించి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెస్తే, మోదీ ప్రభుత్వం చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదన్నారు. కూలీలకు ఉపాధి లేకుండా నిధులు తగ్గించి వ్యవసాయ కూలీల పొట్టగొడుతున్నదని విమర్శించారు. ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డీ విరిచిందని ఆరోపించారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంత కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సమ్మె, గ్రామీణ బందులో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

మా ప్లాట్‌లను చెరువు కబ్జా చేసింది

● 25 లే అవుట్లలో 5వేల ప్లాట్లు మింగేసింది

● 93 ఎకరాల చెరువు... 450 ఎకరాలకు విస్తరణ

● న్యాయం చేయాలని ప్రజావాణిలో అమీన్‌పూర్ పెద్ద చెరువు ప్లాట్ల బాధిత యజమానుల ఫిర్యాదు

బేగంపేట, ఫిబ్రవరి 9: తమ ప్లాట్‌లను ఓ చెరువు కబ్జా చేసిందని, తమకు న్యాయం చేయాలంటూ ప్లాట్ల యజమానులు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణిలో వేడుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామంలో ఉన్న పెద్ద చెరువు గత 5 సంవత్సరాల నుంచి ప్లాట్లను కబ్జా చేసిందని, దీని నుంచి ప్లాట్లను రక్షించాలని సదరు బాధితులు బ్యానర్లతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుకు దిగువన ఉన్న రెండు తూముల నుంచి నీరు వెళ్లకుండా మూసివేయడంతో ఎగువ నుంచి వచ్చే పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వర్షం నీరు నిలిచి, చెరువు విస్తీర్ణం 93 ఎకరాల నుంచి 450 ఎకరాలకు విస్తరించిందని పేర్కొన్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సమీపంలో సుమారు 30 సంవత్సరాల క్రితం 25 లే అవుట్‌లలో వేసిన 5వేల ప్లాట్లను పలువురు కొనుగోలు చేశారు. గ్రామ పంచాయతీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయని, ఎల్ఆర్‌సైతం ఉన్నా.. గత 5 సంవత్సరాలుగా ప్లాట్లు చెరువులో కలిసి పోయయాని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు నీరు కిందకు వెళ్లడానికి ఉన్న రెండు తూములను 5 సంవత్సరాల క్రితం మూసివేయడం వల్లనే సమస్య ఏర్పడిందన్నారు. ఎగువ నుంచి వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వర్షం నీరు కారణంగా ఒకప్పుడు 93 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు ప్రస్తుతం 450 ఎకరాలకు విస్తరించిందని తెలిపారు. దీని వల్ల గతంలో తాము కొనుగోలు చేసిన వేలాది ప్లాట్లు చెరువులో కలిసిపోయాయిని వాపోయారు. చెరువుకు దిగువన నీరు వెళ్లే రెండు తూములను తెరవాలని ప్లాట్ల యజమానులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుకు దిగువన లేఅవుట్లు వేసిన బడా నేతల ఒత్తిడితోనే అధికారులు చెరువు తూములను మూసివేశారని ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

డంపింగ్‌యార్డ్ అనుమతులు రద్దు చేయండి

● ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారికి వినతి

గుమ్మడిదల, ఫిబ్రవరి 9: హైదరాబాదు మహానగరంలో సేకరించిన చెత్తను వేసేందుకు గుమ్మడిదల మండలం ప్యారా నగర్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గుమ్మడిదల మండల ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి మోహన్ చంద్ర పర్గేయస్‌కు జడ్పీటీసీ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ హసన్ వినతిపత్రాన్ని అందించి విన్నవించారు. రెండు రోజులుగా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్ శివారులో డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ ఆందోళన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్యారా నగర్‌లో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలు, ఫారెస్టు పర్యావరణానికి జరిగే ముప్పు, ప్రజల జీవన విధానంపై పడే ప్రభావాన్ని వినతిపత్రం ద్వారా వివరించారు. ప్యారా నగర్‌లో డంపింగ్‌యార్డ్ నిర్మాణం రద్దు చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులు ఇప్పటికే మండలంలోని 13 గ్రామ పంచాయతీల ఏకగ్రీవంగా చేసిన తీర్మాన కాపీలు, మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మాన కాపీలను వినతిపత్రంతో జత చేసి ఫారెస్టు అధికారికి అందజేశారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి చర్చించి ప్రజలకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చినట్టు తెలిపారు.



మోహన్ చంద్ర పర్గేయస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు 12 మంది విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జాతీయ స్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించారు. పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి వాటిలో జిల్లా స్థాయి నుంచి ఒక్కొక్క విభాగంలో ముగ్గురు చొప్పున 12 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 28న రాష్ట్రస్థాయిలో రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో 12 మంది ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థులను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, పూర్ణకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో డీఈవో వెంకటేశ్వరు

కూడవెల్లి వాగులో వ్యక్తి గల్లంతు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 9: మాఘ అమవాస్య స్నానం ఆచరించడానికి వాగులో దిగిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డి గ్రామానికి చెందిన మద్దెల స్వామి(41) గ్రామశివారులోని కూడవెల్లి వాగులో మాఘ అమవాస్య స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్వామిని స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. అక్కడి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టిన మృతదేహం లభించలేదు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

పరిశ్రమలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి



కిషోర్ (ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 9: పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారలోని లీవెన్‌టెక్ బోర్డ్ పరుపుల తయారీ పరిశ్రమలో కిషోర్(18) అనే కార్మికుడు పనిచేస్తున్నాడు. అతను రాజస్థాన్ రాష్టానికి నుంచి 22 నెలల క్రితం ఇక్కడకు వచ్చి, కాళ్లకల్‌లో నివాసముంటూ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శుక్రవారం రబ్బర్ ఫామ్ అయ్యే గదిలో పని చేస్తుండగా కాలుజారి కింద పడడంతో పరిశ్రమ యాజమాన్యం మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించింది. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే అతను మృతిచెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకునిపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువకుడికి వివాహం జరిగిందని విద్యార్థిని ఆత్మహత్య



తరుణి (ఫైల్)

మాసాయిపేట, ఫిబ్రవరి 9: ప్రేమించిన యువకుడికి మరో యువతితో వివాహం కావడంతో మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన ఎర్ర తరుణి(17) హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నది. రెండు సంవత్సరాల పాటు అదే గ్రామానికి చెందిన యువకుడితో ప్రేమాయాణం సాగింది. యువకుడికి గతేడాది మరో యువతితో పెళ్లి కావడంతో మనోవేదకు గురైన తరుణి గురువారం రాత్రి హైదరాబాద్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. తరుణి స్వగ్రామమైన పోతనపల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

గీతం యూనివర్సిటీని సందర్శించిన కలెక్టర్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం (7) సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటు కోసం శుక్రవారం రుద్రారం గీతం డీమ్డ్ యూనివర్సిటీని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. ఆయా గదులు, హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఎస్పీ, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, ఆర్ అండ్‌బీ అధికారులు, రుద్రారం సర్పంచ్ సుధీర్ రెడ్డి, గీతం యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన ఉపాధ్యాయుల సస్పెన్షన్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 9: పాఠశాలలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తూ, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పటాన్‌చెరు ఎంఈవో పీపీ.రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి జిల్లా పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న డీ.సందీప్‌రెడ్డి, ఎస్.నర్సింలు విద్యార్థులను అకారణంగా దండిస్తున్నారు. ఈ విషయమై నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా వ్యవహరించారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారికి ఫిర్యాదులు అందాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విచారించగా ఉపాధ్యాయులు విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది. ఉపాధ్యాయులపై వచ్చిన అభియోగాలను పరిశీలించిన తరువాత వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శుక్రవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ప్రాధాన్యతను, చారిత్రాత్మక నేపథ్యాన్ని వివరించామన్నారు. ఈ చెరువు సుందరీకరణలో భాగంగా లైటింగ్ సిస్టం, లేజర్ లైట్, మ్యూజిక్ ఫౌంటెన్ సిస్టమ్, ఓపెన్ జిమ్, బోటింగ్‌తో పాటు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా సౌకర్యాలు కల్పించాలని లేఖ ద్వారా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు లేఖ ద్వారా తెలిపారన్నారు. సానుకూలంగా స్పందించడం పట్ల మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం కృతజ్ఞతలు తెలిపారు.

జనగామ, ఆలేరు నియోజకవర్గాలకు నీరందించాలి



తపాస్ పల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 9 : తపాస్‌పల్లి రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తిచేసి జనగామ, ఆలేరు, నియోజకవర్గాలకు సాగునీటిని అందించాలని భువనగిరి పార్లమెంటు బీజేపీ కంటెస్టెడ్ ఎంపీ పీవీ శ్యామ్ సుందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగామ, ఆలేరు నియోజకవర్గాలకు సాగునీటిని అందించేందుకు ఈ రిజర్వాయర్ నిర్మాణం చేస్తే ఒరిజినల్ డిజైన్‌లో లేని సిరిసిల్ల, సిద్దిపేటలకు హరీశ్‌రావు నీళ్ల మళ్లించుకుపోయారని విమర్శించారు. భువనగిరి పార్లమెంటుకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భువనగిరి ప్రజల తరపున బాధ్యత వహించి నీటి కోసం పోరాటం చేయవలసిన మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలను విస్మరించి అప్పటి ప్రభుత్వంతో కుమ్మక్కై కోవర్టు రాజకీయాలకు పాల్పడ్డారని వారు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను 5 టీఎంసీ లకు పెంచాలని, వెంటనే డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్మించి కరువు ప్రాంతాలకు నీటిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

శిథిలావస్థలో తొగుట-వెంకట్రావ్‌పేట బ్రిడ్జి

అయినా.. ఆగని రాకపోకలు

- కనిపించని హెచ్చరిక బోర్డులు
- చెట్లకొమ్మలు వేసి చేతులు దులుపుకున్న వైనం
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం

తొగుట, ఫిబ్రవరి 9: మండల కేంద్రం నుండి వెంకట్రావ్‌పేట గ్రామానికి వెళ్లే మార్గంలో కూడవెల్లి వాగుపై నిర్మించిన పురాతన వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రమాదమని తెలిసినా ఎంతోమంది వాహనదారులు ఈ దారి గుండా ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పురాతన బ్రిడ్జి కావడం వల్ల కూడవెల్లి వాగు ప్రవహించినపుడు బ్రిడ్జిపై నుంచి మీటర్ ఎత్తులో నీళ్ల ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిపైన పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, బీటలు వారి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలను వదిలిపెట్టడంతో వాగు నిండి బ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుంది. కానీ అక్కడ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక రోడ్డుపై ముళ్లకంపలు మాత్రం పెట్టి చేతులు దులుపుకున్నారు. కొందరూ వాహనదారులు కొంత దూరం ఎక్కువైనప్పటికీ చందాపూర్ మీదుగా వెంకట్రావ్‌పేటకు ప్రయాణిస్తున్నారు. కానీ కొత్తవారికి దారి తెలియక ఇదే దారిలో ప్రయాణిస్తూ నిత్యం ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. గతంలో ఎంతో మంది వాహనదారులు నీరు పారుతుండగా బ్రిడ్జిపై నుంచి ప్రయాణిస్తూ గాయాలబారిన పడిన సందర్భాలున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కూడవెల్లివాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని తొలగించి దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త బ్రిడ్జి కుదరదు

కూడవెల్లి వాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్నది వాస్తవమేనని ఆర్ అండ్ బీ శాఖ డీఈ వెంకటేశ్ తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం కుదరదని చెప్పారు. ఇది వరకే చందాపూర్ గ్రామ శివారులో వెంకట్రావ్‌పేట వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. కాగా ఈ బ్రిడ్జిపై నుంచి వాహనాలను ఎందుకు అనుమతిస్తున్నారని అడిగితే సమాధానాన్ని దాటవేశారు.



శిథిలావస్థకు చేరుకున్న వంతెనపై నుంచే ప్రయాణిస్తున్న వాహనాలు, అడ్డుగా వేసిన చెట్లకొమ్మలు

పిట్టలవాడలో వ్యక్తి దారుణ హత్య

● గుర్తుపట్టని స్థితిలో మృతదేహం

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 9: సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ మధిర గ్రామం పిట్టలవాడ సమీపంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టడంతో ముఖం గుర్తుపట్టలేని విధంగా కాలిపోయింది. శుక్రవారం గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారమివ్వడంతో ఈ దారుణం వెలుగుచూసింది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు 40ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి హత్యకు గురైనట్లు భావిస్తున్నామన్నారు. ముఖం పూర్తిగా కాలిపోవడంతో ఎవరనేది గుర్తించలేకపోయామని తెలిపారు. క్లూస్ టీం, జాగిలాల ద్వారా యత్నించినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. రాఘవాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రాములు(58) కూలి పని చేస్తూ జీవించేవాడు. గురువారం సాయంత్రం చేపలవేటకు ఒక్కడే వర్షలకుంటకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది నీటిపై తేలుతూ మృతదేహం కనిపించింది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



ఉపాధి హామీ కూలీలతో కేంద్రబృందం అధికారులు

కొండపాక, ఫిబ్రవరి 9 :మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కేంద్రప్రభుత్వంలోని వివిధశాఖలకు చెందిన ట్రైనీ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడారు. కూలీల హాజరు నమోదు విషయమై ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. తమకు వందరోజుల పని సరిపోదని 150 రోజుల పని దినాలు పెంచాలని కూలీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో జరుగుతున్న చేపల పెంపకం, ఇతర ఉపాధిహామీ పనులను పరిశీలించారు. సరైన సమయానికి కూలి డబ్బులు పడుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అవసరం ఉన్న పనులు ఇస్తున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. వారి వెంట డీఆర్డీఏ పీడీ జయదేవ్, ఎంపీడీవో రాంరెడ్డి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ స్లైలాబ్ వ్యవసాయ శాఖ అధికారి తదితరులు ఉన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంతో కళాశాలలో సంబురాలు



రిమ్మనగూడలోని కళాశాలలో సంబురాలు చేసుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు

గజ్వేల్, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు రావడం పట్ల గజ్వేల్ మండలం రిమ్మనగూడ శివార్లలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో సంబురాలు జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకుని, మిఠాయిలు పంచుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత దేశాన్ని తన ఆర్థిక సంస్కరణలతో బలోపేతం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేష ఫణీంద్ర, రంగు నిర్మల, స్వామి, నరేశ్‌రెడ్డి, సౌమ్య సౌందర్య, పూజిత తదితరులున్నారు. కాగా తెలంగాణ ముద్దుబిడ్డ, అపర చాణిక్యుడు అయిన పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ఇవ్వడం పట్ల గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం, ప్రజల తరపున గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్యది హత్యే

● మంత్రాల నెపంతోనే ఘాతుకం ● నిందితుల అరెస్టు.. రూరల్ సీఐ

సిద్దిపేట క్రైం/ నంగునూరు, ఫిబ్రవరి 9: నంగునూరు మండలం ఘణపూర్‌లో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్యది హత్యేనని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వెల్లడించారు. శుక్రవారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఘణపూర్ గ్రామానికి చెందిన బత్తుల తిరుపతి తన కూతురుకు అదే గ్రామానికి చెందిన బండి వెంకటయ్య మంత్రాలు చేస్తున్నాడని అనుమానం పెంచుకున్నాడు. వెంకటయ్యను చంపితే రూ.5 లక్షల తోపాటు లావని పట్టాభూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నంగునూరుకు చెందిన అల్లెపు పరశురాములు, తాళ్లపల్లి సాయగౌడ్‌లకు ఆశచూపి వారితో తిరుపతి ఒప్పందం చేసుకున్నాడు. ఈ విషయాన్ని పరశురాములు తన స్నేహితులైన తుపాకుల సాయి, గొడుగు అరవింద్, అల్లెపు రంజిత్‌కు చెప్పడంతో ఒక్కొక్కరు లక్ష తీసుకొని వెంకటయ్యను హత్య చేసేందుకు అంగీకరించారు. అడ్వాన్స్ ముట్టడంతో ఈ నెల 3న నంగునూరు వచ్చి ఇంటికి వెళ్తున్న వెంకటయ్యను ఘణపూర్ చెక్‌డ్యామ్ వద్ద ఆపి మాటల్లో పెట్టారు. అదే సమయంలో మరొకరు బైక్‌తో వెంకటయ్యను ఢీ కొట్టడంతో రోడ్డు పక్కనే జేసీబీ గుంతలో పడ్డాడు. పథకం ప్రకారం వారు వెంట తెచ్చుకున్న టవల్, తాడుతో మెడకు ఉరేసి హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని సీఐ వివరించారు. నిందితులను విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చేర్యాల మండలంలో ఎరువుల దుకాణాల తనిఖీ

చేర్యాల, ఫిబ్రవరి 9: చేర్యాల మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ రాయాలని, అలాగే ఈ పాస్ మిషన్‌లో ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలను అప్‌డేట్ చేయాలని కోరారు. ప్రతీ ఎరువుల దుకాణంలో 10 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలలో మొత్తం 27వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్, ఎరువుల దుకాణ యజమానులు ఉన్నారు.

సిద్దిపేట ఉపాధ్యాయుడికి బుక్ ఫెయిర్‌లో ప్రసంగించే అవకాశం

కొండపాక, ఫిబ్రవరి 9: హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'నేటి బాల సాహిత్య తీరు తెన్నులు' అనే అంశంపై ప్రసంగించే అవకాశం సిద్దిపేటకు చెందిన కవి, రచయిత భైతి దుర్గయ్యకు లభించినట్లు అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు.

ఒగ్గుపూజారి కుటుంబానికి పరామర్శ

చేర్యాల, ఫిబ్రవరి 9 : అనారోగ్యంతో మరణించిన కొమురవెల్లి గ్రామానికి ఒగ్గు పూజారి బైరి ఐలయ్య కుటుంబాన్ని పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. అంత్యక్రియల సందర్భంగా వారికి దేవస్థానం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కమిటీ సభ్యులు బద్రప్ప, బచ్చల శ్రీనివాస్, పాల్య శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, కొమురవెల్లి మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకులాలపై కుట్ర

గజ్వేల్, ఫిబ్రవరి 9: గురుకుల విద్యార్థుల ఎదుగుదలను ఓర్వలేని కొందరు గురుకులాలపై కుట్ర చేస్తున్నారని స్వేరోస్ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని కృష్ణ అనుమానం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకులాలకు కార్పొరేట్ కంటే ఎక్కువ ఆదరణ ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా అలజడి మొదలైందని, ఈ క్రమంలోనే గొప్పగా చదువుకోవాలని వచ్చిన పిల్లలు భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో హత్యకు గురయ్యారన్నారు. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్వేరోస్ నెట్‌వర్క్ ఈ కుట్రను తిప్పికొడుతుందన్నారు.ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని సంతకాల సేకరణ

కొండపాక, ఫిబ్రవరి 9: దేశవ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టిన కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య మాట్లాడుతూ రైతన్న కార్మిక వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరుతూ వెలికట్టలో సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: ఓటమి చెందామని కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, భవిష్యత్తు మనదేనని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పటికీ ఓటమి చెందడం బాధ కలిగించిందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, ఎంపీపీ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు. కాగా మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం హర్షణీయమని వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. బహుభాషా కోవిదుడైన పీవీ మన ప్రాంత ముద్దు బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి



గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఖమ్మంపల్లి ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి

కొండపాక, ఫిబ్రవరి 9: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని ఖమ్మంపల్లి ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి శుక్రవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.. గ్రామంలోని 1060, 1061 సర్వే నంబర్లు గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా ఈ ప్రభుత్వ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేయడం కోసం గతంలో కేటాయించారని అయితే ఇంతవరకు నిర్మించలేదన్నారు. అందులోని కొంత భూమిలో గ్రామపంచాయతీకి అవసరం గల డంపింగ్ యార్డు నిర్మాణం కూడా జరిగిందన్నారు. వందకు పైగా ఎకరాలు ఉన్న భూమిలో గతంలో కొంతమందికి పంపిణీ చేయగా మిగిలిన భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేదని కానీ ప్రస్తుతం అది కబ్జాకు గురవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ కు విన్నవించుకోగా ఆర్ఐతో పాటు సర్వేయర్‌ను పంపించాడని, వారు సైతం ప్రత్యక్షంగా ప్రభుత్వ భూమిని పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన దృశ్యం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 9: కొత్తగూడెంలో శనివారం జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు వెళ్లే జిల్లా క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్, రెడ్డి జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షుడు బయ్యారపు కనకారెడ్డి, జట్టు కోచ్‌లు కృష్ణకుమార్, నిశాంక్ గౌడ్, విజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తంజీమ్ ఎన్నికలపై రగడ .. పోలీసుల లాఠీచార్జి



సుఫియా మసీదు వద్ద ఘర్షణ పడుతున్న ఇరు వర్గాల సభ్యులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 9: తంజీమ్ ఎన్నికలపై వివాదం సిద్దిపేట పట్టణంలోని మసీదు వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. సుఫియా మసీదులో మధ్యాహ్నం నమాజ్‌లో పాల్గొన్న తంజీమ్ కార్యవర్గం మరో వర్గం సభ్యులతో వాగ్వాదానికి దిగారు. దాంతో మసీదు వద్ద రెండు వర్గాల సభ్యులు ఘర్షణకు దిగారు. ఇరువర్గాల సభ్యులు ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని లాఠీచార్జి చేసి ఇరువర్గాల సభ్యులను చెదరగొట్టారు. దీంతో మసీదు వద్ద ఉద్రిక్తత సద్దుమణిగింది.

అక్రమంగా ఇసుక నిలువ చేస్తే చర్యలు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సీజ్ చేసిన ఇసుక డంపులు

గజ్వేల్, ఫిబ్రవరి 9: అక్రమంగా ఇసుకను నిలువ చేస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు హెచ్చరించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారికి ఆనుకుని అక్రమంగా డంప్ చేసిన ఇసుకను, వర్గల్ మండలం గౌరారం రాజీవ్‌రహదారికి ఆనుకుని ఉన్న డంప్‌లపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. డంప్‌లను సీజ్ చేసి, స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసిన వారిలో గుడికందుల నరేందర్, గుడికందుల గణేశ్, బక్కుల యాదగిరి, శ్రీరాంకృష్ణ, గోపాలకృష్ణ, మామిండ్ల స్వామిపై కేసులు నమోదు చేశామన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 9 : పీఎం పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును సోషల్ ఆడిట్ అధికారి భాస్కర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం నిర్వహణ తీరుపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి పోషకాహారాన్ని అందిస్తున్నారో అనే విషయాలను పరిశీలించారు.

'దుద్దెడ చాకలికుంట కబ్జాను అడ్డుకోవాలి'

కొండపాక, ఫిబ్రవరి 9: మండలంలోని దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద ఉన్న చాకలి కుంట స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ఆక్రమిస్తున్నారని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కొండపాక తహసీల్దార్‌కు రైతులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దుద్దెడ గ్రామంలో టోల్ గేట్ వద్ద ఉన్న చాకలికుంటను, నక్ష బాటను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తాతల కాలం నుంచీ అక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయని, అప్పటి నుంచి వ్యవసాయ పొలాలకు నక్ష బాట దారి ఉండేదన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ కుంటను ఆక్రమించుకొని కబ్జాను చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. రియల్ వ్యాపారుల ఆక్రమణతో తమ వ్యవసాయ పొలాలకు ట్రాక్టర్లు హార్వెస్టర్లు వెళ్లేందుకు దారి లేదని, ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం స్వాధీనం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 9: సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న క్వింటాళ్ల రేషన్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలం మరిముచ్చాల గ్రామానికి చెందిన ఆకుల మహిపాల్ చుట్టు పక్క గ్రామాల్లో ప్రజల నుంచి ప్రభుత్వ రేషన్ బియ్యాన్నితక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రైస్‌మిల్‌లో అమ్మేందుకు తరలిస్తున్నట్టు విశ్వసనీయంగా సమాచారమందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి వాహనంలో తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100, టాస్క్‌ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667447, 8712667446, డయల్ 100 మాచారం అందించాలని సూచించారు.



రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

'గావ్ చలో అభియాన్'ను విజయవంతం చేయాలి

కొండపాక, ఫిబ్రవరి 9: బీజేపీ నిర్వహిస్తున్న గావ్ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు దారం గురువారెడ్డి ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొండపాక మండలం దుద్దెడ, కుకునూరుపల్లిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని కోరారు. కేంద్రంలో ప్రధానమంత్రి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, పొన్నం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

హుస్నాబాద్, ఫిబ్రవరి 9 : ఈ నెల 15వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గిరిజన ఉద్యోగులకు ప్రభుత్వం ఓడీ (ఆన్ డ్యూటీ) ప్రకటించడం పట్ల శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల ఫ్లెక్సీలకు గిరిజన సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 15వ తేదీన హుస్నాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీరన్న నాయక్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, గిరిజన సంఘాల నాయకులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పదోతరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేసిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వర్గల్, ఫిబ్రవరి 9: అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చౌదరిపల్లిలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు విషయాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లతో పాటు జామెట్రి బాక్సులు, పరీక్ష మెటీరియల్‌ను అందించారు. పాఠశాలలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఆర్టీయూ వర్గల్ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అదరాసుపల్లి శశిధర్‌శర్మ, వర్గల్ మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వర్గల్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు సుభాష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, బుచ్చిరాములు, కృష్ణారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, భారతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లిలో మాజీ ఎమ్మెల్యే పూజలు



దుబ్బాక, ఫిబ్రవరి 9: కూడవెల్లి రామలింగేశ్వరుడిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు దర్శించుకుని పూజలు చేశారు. తొలుత ఆలయ వర్గాలు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న హుస్నాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యా శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని టీచర్, ప్రిన్సిపాల్ చితకబాది గాయపర్చారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, నరేష్, చిట్యాల శేఖర్, చట్ల సమ్మయ్య, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 9 : జీవనోపాధి కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ బుర్ర కరుణాకర్ ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుర్ర కరుణాకర్ ఇటీవల కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకోగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం కల్లేపల్లి గ్రామంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, ఆటో డ్రైవర్ల జీవనభృతి కింద నెలకు రూ.15 వేలు అందించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజయ్య లక్ష్మణ్, తిరుపతిరెడ్డి,ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి